క్లుప్తంగా

శాస్త్రోక్తంగా ధ్వజారోహణ



సంగం : హరహర మహాదేవ.. శంభోశంకరా అంటూ మండలంలోని దువ్వూరులో కొలువైన శ్రీగంగా పార్వతి సమేత కోటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అంకురార్పణతో బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వస్తిశ్రీ క్రోధి నామ సంవత్సర జ్యేష్ఠ ద్వాదశి మంగళవారం మొదలై ఈనెల 26వ తేదీ వరకు ఈ వేడుకలు జరుగుతాయి. ఈ సందర్భంగా ప్రతిరోజు స్వామి, అమ్మవార్లు వివిధ రకాల అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం ధ్వజారోహణ జరిపించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చప్పర ఉత్సవం, రాత్రి రావణ సేవ గావించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 21న గిన్నెభిక్ష, రాత్రి నందిసేవ, 22న ఉదయం చప్పర ఉత్సవం, రాత్రి అంబారి సేవ, 23న ఉదయం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం, రాత్రి తీర్థవాది, పురుషామృగసేవ, 24న ఉదయం ధ్వజావరోహణ, రాత్రి అలకలతోపు, అశ్వవాహన సేవ, 25న రాత్రి శేషవాహన సేవ, 26న రాత్రి ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వేద పండితుడు శివకుమారస్వామి తెలిపారు.

వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు బస్సులు

ఉదయగిరి : దుత్తలూరు మండలం నర్రవాడలో కొలువైన వెంగమాంబ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 26వ తేదీన ఉదయగిరి డిపో నుంచి 25 ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతామని డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయగిరి పట్టణంలోని డిపోలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. బ్రహ్మోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఉదయగిరి, సీతారామపురం, బద్వేలు, పోరుమామిళ్ల నుంచి ప్రత్యేక బస్సులు సాధారణ చార్జీలతో నడపనున్నట్లు చెప్పారు. భక్తులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సిబ్బందితో సమీక్షించారు.

టీచర్ల సమస్యల పరిష్కారమే లక్ష్యం

వరికుంటపాడు : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏపీటీఎఫ్ సంఘం పనిచేస్తుందని ఆ సంఘ జిల్లా కార్యదర్శి డి.మాల్యాద్రి తెలిపారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, తూర్పు రొంపిదొడ్ల, గణేశ్వరపురం, రామదేవులపాడు, జడదేవి, కనియంపాడు, వరికుంటపాడు తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు ఉద్యమాలు చేపట్టే దిశలో తమ సంఘం ముందుంటుందన్నారు. ఇప్పటివరకు ఉపాధ్యాయుల సమస్యలను ఎన్నో పరిష్కరించామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు బాలకృష్ణ, జిలాని, బాషా మాల్యాద్రి, తిరుపతయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, నిస్సార్ అహ్మద్ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

వింజమూరు(ఉదయగిరి) : వింజమూరు మండలంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో టీచర్ల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు వేములపాటి శివకోటారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై ఏపీటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ఉపాధ్యాయ హక్కులు, బాధ్యతలను నిరంతరం గుర్తుచేస్తూ సమాజ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు క్రియాశీలకంగా వ్యవహరించేలా సంఘం నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు పి.కొండారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పేరం మల్లికార్జునరావు, గుర్రం నారాయణ, యు.ప్రసాద్‌రెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

సీతారామపురం : మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా స్థానిక జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు కీటకజనిత వ్యాధులపై వైద్యాధికారిణి స్వప్నారెడ్డి బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, మురుగు చేరితే మలేరియా జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటూ దోమతెరలు వినియోగించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి నీటి నిల్వలు తొలగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహారం తీసుకోవాలని సూచించారు. ఎవరైనా రెండ్రోజులకు మించి జ్వరంతో బాధపడుతుంటే వెంటనే పీహెచ్‌సీ మలేరియా పరీక్షలు చేయించుకుని వైద్యసేవలు పొందాలన్నారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉదయగిరి సబ్‌యూనిట్ అధికారి నౌషాద్ బాబు, ఎంపీహెచ్‌ఎస్‌లు భోగ్యం వెంకటేశ్వర్లు, రియాజ్ పాల్గొన్నారు.

వేదగిరిలో నీటికి వెతలు



తాగునీటిని తరలించేందుకు సిద్ధం చేసిన ట్యాంకర్

- మరమ్మతులకు గురైన మోటార్
- పెన్నా నుంచి సరఫరాకు అంతరాయం
- ఐదు ట్యాంకర్లతో సరఫరా చేస్తున్న వైనం

నెల్లూరు సిటీ: ప్రముఖ పుణ్యక్షేత్రమైన నరసింహ కొండలో వెలసిన వేదగిరిలో తాగునీటికి సమస్యలు తలెత్తాయి. ఈ క్రమంలో భక్తుల అవస్థ వర్ణనాతీతంగా మారింది. వాస్తవానికి ఏడు కోనేర్ల నుంచి కొండపైకి నీటిని పైప్‌లైన్ ద్వారా సరఫరా చేస్తుంటారు.

అయితే కోనేరులో నీటి కొరత కారణంగా సరఫరా నిలిచిపోయింది. ఈ తరుణంలో పెన్నా నుంచి మెట్ల మార్గంలో పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేయాల్సి ఉండగా, మోటార్ మరమ్మతులకు గురైంది. దీంతో రోజూ ఐదు ట్యాంకర్ల ద్వారా కొండపైకి నీటిని సరఫరా చేస్తున్నారు. అన్నదానం, పూజల నిమిత్తం వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు.

వారంలో సమస్యను పరిష్కరిస్తాం

పెన్నా నుంచి నీటిని సరఫరా చేసే మోటార్ మరమ్మతులకు గురైంది. దీన్ని వారంలో బాగు చేయించి సమస్యను పరిష్కరిస్తాం. భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఐదు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. వర్షాలు పడితే కోనేరు మార్గం ద్వారా నీటిని ఆలయ ప్రాంగణానికి సులువుగా సరఫరా చేయొచ్చు.

– గిరికృష్ణ, ఈఓ

ఠారెత్తిస్తున్న కూరగాయల ధరలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆకాశాన్నంటుతున్న టమాటో, ఉల్లిపాయల ధరలు వింటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. టమాటో ధర కొన్ని రోజులుగా పెరుగుతోంది. కిలో రూ.50గా ఉన్న దీని ధర ప్రస్తుతం రూ.80కు చేరుకుంది. ఉల్లిపాయలు కిలో రూ.35 నుంచి రూ.50కు ఎగబాకింది. రైతుబజార్‌లో గతంలో మాదిరిగా సబ్సిడీ ధరలకు వీటిని అందజేయాలని ప్రజలు కోరుతున్నారు.

లాడ్జిల్లో తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ నారాయణ

నెల్లూరు(క్రైమ్): నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న లాడ్జిలను పోలీస్ అధికారులు మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు తనిఖీ చేశారు. లాడ్జిల్లోని ప్రతి గదినీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్ని రోజుల నుంచి ఉన్నారు.. ఎక్కడి నుంచి.. ఏ పనిపై వచ్చారనే అంశాలతో పాటు వ్యక్తిగత వివరాలను అక్కడ బస చేసిన వారిని అడిగి తెలుసుకున్నారు. వారి లగేజీలను తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. లాడ్జిలో దిగిన వ్యక్తుల ఆధార్‌కార్డుతో పాటు వారి పూర్తి వివరాలతో రిజిస్టర్‌ను తప్పక నిర్వహించాలని సూచించారు. ఈ వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్లో రోజూ తెలియజేయాలని నిర్వాహకులకు సూచించారు. లాడ్జి పరిసరాలు స్పష్టంగా కనిపించేలా సీసీ కెమెరాలను విధిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించండి



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని 18 గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేయాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధిలో రాజీపడేది లేదని చెప్పారు. అధికారులు మారాలని సూచించారు. ఎంపీడీఓ శైలేంద్ర, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన స్కూల్ బస్సులను సీజ్ చేయాలి



ఇన్‌చార్జి డీటీసీకి వినతిపత్రమిస్తున్న బీజేవైఎం నేతలు

నెల్లూరు (టౌన్): కాలం చెల్లిన స్కూల్ బస్సులను సీజ్ చేయాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు లెక్కల రాజశేఖర్‌రెడ్డి, నేత మదన్‌సాయిరెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఇన్‌చార్జి డీటీసీ సుధాకర్‌రెడ్డికి వినతిపత్రాన్ని బుధవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. రవాణా అధికారులు తరచూ తనిఖీలు చేపట్టాలని కోరారు. నేతలు శ్రీకాంత్, శివ, వెంగళ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని వెంకటేశ్వరపురంలోని పార్టీ కార్యాలయంలో పేదలకు దుప్పట్లను బుధవారం పంపిణీ చేశారు. పార్టీ 54వ డివిజన్ ఇన్‌చార్జి నరసాపురం ప్రసాద్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు. డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల వద్ద విజిబుల్ పోలీసింగ్



కృష్ణచైతన్య జూనియర్ కళాశాల వద్ద పోలీసుల గస్తీ

నెల్లూరు(క్రైమ్): విద్యార్థినుల భద్రతే ధ్యేయంగా విద్యాసంస్థల వద్ద విజిబుల్ పోలీసింగ్‌ను పోలీస్ అధికారులు బుధవారం నిర్వహించారు. విద్యాసంస్థల వద్ద ఈవ్‌టీజింగ్, అల్లరిమూకల ఆగడాలు, ఇతర నేరాలు జరగకుండా గస్తీని ముమ్మరం చేశామని పోలీసులు వెల్లడించారు.

వస్త్ర సంచులనే వినియోగించాలి



వస్త్ర సంచులను ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బారకాసు): ప్లాస్టిక్ కవర్లకు స్వస్తి పలికి.. వస్త్ర సంచులనే వినియోగించాలని పర్యావరణ నేషనల్ ఎన్జీఓస్ నెట్‌వర్క్ కన్వీనర్ విజయబాబు పేర్కొన్నారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ వద్ద వస్త్ర సంచులను పర్యావరణ జాతీయ ఎన్జీఓస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బుధవారం పంపిణీ చేశారు. ప్లాస్టిక్ కవర్లలో పలు వస్తువులను తీసుకెళ్తున్న వారికి వస్త్ర సంచులను అందజేశారు. వివిధ సంస్థల ప్రతినిధులు సువర్ణకుమారి, గాదంశెట్టి శేఖర్‌బాబు, మురళి, రమేష్, సుప్రవీణ, శైలజ, ఆదిలక్ష్మి, జ్యోతిజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

నెల్లూరు సిటీ: పౌర్ణమిని పురస్కరించుకొని అరుణాచలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం రెండు ఆర్టీసీ బస్సులను అధికారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ నెల 21వ తేదీ ఉదయం పది నుంచి 10.30 మధ్యలో ఈ బస్సులు బయల్దేరనున్నాయని ఒకటో డిపో మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు. టికెట్ ధరను రూ.1200గా నిర్ణయించామని చెప్పారు. ఆన్‌లైన్ లేదా టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద బుక్ చేసుకోవచ్చని తెలిపారు. భక్తుల సంఖ్య అధికంగా ఉంటే మరో బస్సును సైతం ఏర్పాటు చేయనున్నామని, వివరాలకు 90003 23612, 73828 84709 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

జాబ్ మేళా రేపు

నెల్లూరు(మినీబైపాస్): జాబ్ మేళాను శుక్రవారం నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి అధికారి రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టాటా ఏఐజీ జనరల్ ఇన్సురెన్స్, సంగీత మొబైల్స్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎన్సెస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీసిటీలో ఉద్యోగాలకు గానూ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. చానల్ సేల్స్ మేనేజర్, సేల్స్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, డిప్లొమా ఇంజినీరింగ్ ట్రెయినీస్, రికవరీ ఎగ్జిక్యూటివ్స్ ఉద్యోగాలకు గానూ డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ చదివిన వారు అర్హులని తెలిపారు.

యోగా దినోత్సవం రేపు

నెల్లూరు(బృందావనం): పొదలకూరు రోడ్డులోని గౌతమినగర్‌లో గల శ్రీరామచంద్ర మిషన్ ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఉదయం 6.30కు నిర్వహించనున్నామని సెంటర్ కో ఆర్డినేటర్ వెంకటకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యాన కార్యక్రమాలను నిర్వహించనున్నామని చెప్పారు. ఉచిత మెడికల్ క్యాంప్‌ను ఆయుర్వేద, హోమియోపతి వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించి మందులను పంపిణీ చేయనున్నామని వివరించారు. ఆసక్తి గల వారు హాజరుకావాలని కోరారు.

కాలువలో పూడిక తీయించాలని వినతి

నెల్లూరు(బారకాసు): నగరంలోని 14వ డివిజన్లో గల ఏసీనగర్ సబ్ డివిజన్ మున్సిపల్ కార్యాలయ వెనుక ఎస్వీజీఎస్ కళాశాల వరకు ఉన్న ప్రధాన మురుగునీటి పారుదల కాలువలో పూడిక తీయించాలని మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరిప్రసాద్ కోరారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇన్‌చార్జి కమిషనర్ శర్మదకు వినతిపత్రాన్ని బుధవారం సమర్పించారు.

చండీ హోమం రేపు

నెల్లూరు(బృందావనం): వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీ హోమాన్ని శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించనున్నామని మఠం నిర్వాహకులు కొత్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనాలనుకునే వారు 96528 60264 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పోలీసులకు ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్): నగరంలోని 35వ డివిజన్లో తమతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు బలవంతంగా రాజీనామాలు చేయించారని డివిజన్ మాజీ వలంటీర్లు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలాజీనగర్‌లోని స్థానిక నేతలపై అక్కడి మాజీ వలంటీర్లు ఫిర్యాదు చేశారు.

పులి వాహనంపై చాముండేశ్వరిదేవి



ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నంలో చాముండేశ్వరిదేవి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం చప్పరోత్సవాన్ని నిర్వహించారు. రాత్రి చాముండేశ్వరిదేవిని విశేషంగా అలంకరించి పులి వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

ఘనంగా శివాజీ విగ్రహావిష్కరణ



నెల్లూరు(మినీబైపాస్): హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ట్రంక్‌రోడ్డులోని శివాజీ సెంటర్‌లో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని బీజేపీ నేత సురేంద్రరెడ్డి, ఆరెస్సెస్ సంయోజక్ పుట్టా శేషురెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేంద్రరెడ్డి మాట్లాడారు. శివాజీ సెంటర్‌లో వినాయక చవితి ఉత్సవాలను 35 ఏళ్లుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. చైతన్య వేదిక అధ్యక్షుడు మహేశ్, శివాజీ సెంటర్ మిత్రమండలి సభ్యులు సుబ్రహ్మణ్యం, పేటేటి భాస్కర్‌రావు, రంగరాజన్, అలిమేలి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అల్లీపురంలో కార్డన్ సెర్చ్



నెల్లూరు సిటీ: అల్లీపురంలోని టిడ్కో గృహ పరిసరాల్లో కార్డన్ సెర్చ్‌ను రూరల్ పోలీసులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మారుతికృష్ణ మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లో గస్తీని ఏర్పాటు చేస్తామని వివరించారు. అనుమానితులు, కొత్త వ్యక్తులు తారసపడితే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని కోరారు. ఎస్సై స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వెంకటరమణ



సమావేశానికి హాజరైన అధికారులు, సిబ్బంది

నెల్లూరు(బారకాసు): సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని ఇన్‌చార్జి కమిషనర్ శర్మద పేర్కొన్నారు. వెక్టార్ బోర్న్ డిసీజ్ అనే అంశంపై నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగాధికారులు, సచివాలయాల కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ మాట్లాడారు. దోమలతో వ్యాప్తి చెందే మలేరియా, టైఫాయిడ్, చికున్ గున్యా, డెంగీ, బోధకాలు, మెదడు వాపుతో పాటు ఇతర అంటువ్యాధులను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఇళ్ల చుట్టూ, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా గృహాల యజమానులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఎస్‌ఈ సంపత్‌కుమార్ మాట్లాడారు. ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకుల నుంచి సరఫరా అయ్యే తాగునీరు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని చెప్పారు. సచివాలయాల వారీగా కేటాయించిన ఫాగింగ్ మెషీన్లను ప్రణాళికబద్ధంగా వినియోగించాలని కోరారు. సిటీ ప్లానర్ దేవీకుమారి, అర్బన్ ఫామిలీ వెల్ఫేర్ అధికారి జిజియాబాయి, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగులను నెల్లూరుకు బదిలీ చేయరూ..



నెల్లూరు(అర్బన్): తిరుపతి జిల్లాకు కేటాయించిన నెల్లూరు వైద్యశాఖ అధికారులు, ఉద్యోగులను తిరిగి జిల్లాకు కేటాయించాలని పలువురు కోరారు. ఈ విషయమై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో మాట్లాడాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావుకు వినతిపత్రాన్ని ఆ శాఖ ఉద్యోగులు బుధవారం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సకాలంలో రైళ్లు లేక నెల్లూరు నుంచి తిరుపతి వెళ్లేందుకు రోజూ ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. త్వరలో జరగనున్న సాధారణ బదిలీల్లో ఉద్యోగులను నెల్లూరుకే కేటాయించాలని కోరారు. సంతపేటలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మహేష్, ఫయాజ్, మార్క్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు డ్రై ఫ్రూట్స్ వితరణ



నెల్లూరు(అర్బన్): నగరంలోని నారాయణ స్పెషాల్టీ ఆస్పత్రిలో గర్భిణులకు బాదం, పిస్తా, చిక్కీలతో కూడిన డ్రైఫ్రూట్స్ బాక్సులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి గైనకాలజీ విభాగాధిపతి ప్రసన్న మాట్లాడారు. నారాయణ మాతృసేవా పథకంలో భాగంగా వీటిని అందజేశామని వివరించారు. ఆస్పత్రి అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ సతీష్, ఏజీఎం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛనర్ల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న గౌస్

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్సెమ్ గౌస్ కోరారు. భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్ల సంక్షేమ భవనంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘ జిల్లా సర్వసభ్య సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎస్వీవీఎస్ మూర్తి మాట్లాడారు. 12వ పీఆర్సీ కమిషనర్ రాజీనామా చేయడంతో ప్రక్రియ మొదటికి వచ్చిందని తెలిపారు. అనంతరం నేత్ర పరీక్షలను రాజశేఖర్ ఐ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అసోసియేషన్ కోశాధికారి హజరత్తయ్య, బుచ్చిరెడ్డిపాళెం శాఖ అధ్యక్షుడు మాల్యాద్రి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణయ్య, అసోసియేషన్ ఉపాధ్యక్షులు మస్తానయ్య, వీరేంద్రనాథ్, ఖాసిం, పొదలకూరు శాఖ అధ్యక్షుడు కోటేశ్వరరావు, ఆత్మకూరు యూనిట్ కార్యదర్శి సుధాకర్, సంయుక్త కార్యదర్శి సుబ్బారావు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతకు నివాళి



నెల్లూరు(మినీబైపాస్): బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన చిత్రపటానికి పార్టీ నేతలు బుధవారం నివాళులర్పించారు. నేతలు ఆంజనేయరెడ్డి, సురేంద్రరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీరెడ్డి, ఆత్మకూరు ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, వింజమూరు మాజీ జెడ్పీటీసీ నారాయణరెడ్డి, వడ్డే శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.